‘ఉపాధి’ జాతర


జోరుగా కొనసాగుతున్న ఉపాధి పనులు

- పెరుగుతున్న కూలీల సంఖ్య
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న పనులకు రోజుకు రోజుకూ కూలీల సంఖ్య పెరుగుతోంది. కూలీలు అధికంగా పనిచేస్తున్న మండలంలో జిల్లాలోనే అక్కన్నపేట మొదటి స్థానంలో నిలిచింది. మండల పరిధిలో 31 గ్రామ పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి.

ప్రతిరోజూ 2,900 మంది కూలీలకు పని

మండల వ్యాప్తంగా ప్రతీ రోజు సుమారుగా 2,900 నుంచి 3,100 మందికి పైగానే కూలీలు పనులకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. మండలంలోని గౌరవెల్లి, మల్లంపల్లి, కట్కూర్, రామవరం, అంతక్కపేటతో పాటు పలు గ్రామాల్లో అధిక సంఖ్యలో మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతీ రోజు ఉపాధి పనులు జరిగే ప్రదేశాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. కూలీల సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఎండలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పని ప్రదేశంలో చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వారాల బిల్లులు కూలీలకు చెల్లించవల్సి ఉంది.

రూ.307కు పెంచారు

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు దినసరి కూలీ రూ.300 నుంచి రూ.307కు పెంచుతూ కేంద్రం ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. దీనిని 2025–26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి తీసుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జాతరలా కొనసాగుతున్నాయి.

బిల్లులు వెంటనే చెల్లింపు



కూలీల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ వేసవిలో మొదట వెయ్యి మందితో ప్రారంభమై ప్రస్తుతం 3,100 మంది కూలీలు పనిచేస్తున్నారు. రోజుకు కూలి రూ.200 నుంచి రూ.280 వరకు పడుతోంది. బిల్లులు కూడా త్వరగానే వస్తున్నాయి.

– భానోతు జయరాం, ఎంపీడీఓ అక్కన్నపేట మండలం

సాగునీరు అందించేందుకు కృషి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

మద్దూరు(హుస్నాబాద్): ఈ వానాకాలం నాటికి లద్నూరు, బొమ్మకూరు, తపస్‌పల్లి రిజర్వాయర్లకు పూర్తిస్థాయిలో నీరందేలా చర్యలు తీసుకుంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లద్నూరులో మంగళవారం ఆయన చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్వేతతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ లద్నూరు రిజర్వాయర్‌లో నీటి లీకేజీ వల్ల రైతులకు పెద్ద సమస్యగా మారిందని, మరమ్మతులు చేయించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అలాగే ఉద్యోగుల సమ్మె వల్ల 34 రోజుల పాటు పంప్‌హౌస్ బంద్ అవడం వల్ల కూడా నీటి సరఫరాలో అంతరాయం కలిగిందని వాపోయారు. కార్యక్రమంలో జీవన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, సుమలత, శ్రీధర్‌రెడ్డి, పద్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాలరాజు సురేశ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మద్దూరు, దూళ్మిట్ట మండలాల అధ్యక్షులు సంతోష్‌కుమార్, యాదగిరిల అధ్యక్షతన స్థానిక తాజ్‌గార్డెన్‌లో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ పార్టీ సభను ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గజ్వేల్‌రూరల్: చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండటమే ధ్యేయమని సత్యసాయి సంజీవని ట్రస్ట్ నిర్వాహకుడు జగన్నాథశర్మ అన్నారు. కొండపాకకు చెందిన సత్యసాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ కేంద్రం ఆధ్వర్యంలో సరస్వతి శిశుమందిర్‌లో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టుద్వారా ఇప్పటి వరకు 30 వేల మంది చిన్నారులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు నిర్వహించారన్నారు. చిన్నారులకు ఏదైనా గుండె సంబంధిత సమస్య ఉంటే తమ ట్రస్టును సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశుమందిర్ ప్రధానాచార్యులు హరిణాపవన్, సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ట్రస్టు నిర్వాహకుడు విశ్వనాథ్, డాక్టర్ గణేశ్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సిద్దిపేటరూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఏఓకు పంచాయతీ కార్యదర్శులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి తమ సొంత డబ్బుతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా లాంటి పనులు నిర్వహించామని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ శాఖలకు సంబంధించిన సర్వేలు చేయడం ద్వారా తీవ్ర ఒత్తిడిలో ఉన్నామని వాపోయారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల సర్వే నుంచి తమను మినహాయించాలని కోరారు. కార్యాలయ పనివేళల్లో మాత్రమే టీసీలు పెట్టాలని, సెలవు రోజుల్లో కూడా పనిచేయించుకోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీ వద్దు

దుబ్బాక: తమ భూముల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయవద్దని భూ నిర్వాసిత రైతులు తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని 1523 సర్వే నంబరులో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్టు ప్రచారం జరుగుతోందని, ఆ భూమిపైనే ఆధారపడి బతుకుతున్నామని తమ పొట్ట కొట్టవద్దని రైతులు వాపోయారు. తమకు ఎలాంటి సమాచారం తెలియజేయకుండా రెవెన్యూ అధికారులు స్కిల్ యూనివర్సిటీ కోసం సర్వే చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

అంకిత భావంతోనే గుర్తింపు

తొగుట(దుబ్బాక): ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి సమాజంలో గుర్తింపు సంపాదించాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్న ముత్యంపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి పాటు పడుతున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణతో పాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మహాలక్ష్మి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



జగదేవ్‌పూర్(గజ్వేల్): శ్రీరామనవమి సందర్భంగా స్థానిక రంగనాయకులస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రవి, నర్సింహులు, శ్రీహరి, స్వామి, మహేశ్, ఆర్యవైశ్య మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిసాన్ న్యాయయోధ కన్వీనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: ఆలిండియా కిసాన్ న్యాయయోధ రాష్ట్ర కన్వీనర్‌గా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ అఖిలేష్ శుక్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

పెరిగిన సిలిండర్ ధర తగ్గించాలి


చేర్యాల(సిద్దిపేట): సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించి, పేదలపై భారంమోపే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించి, పేద ప్రజలపై భారం పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.500 వంట గ్యాస్ తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వర్తించేలా చేసి, పెంచిన ధర తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌మావో, చేర్యాల, కొమురవెల్లి మండలాల కార్యదర్శులు అరుణ్‌కుమార్, రవీందర్, నాయకులు ప్రభాకర్, కుమార్, మల్లేశం, శ్రీకాంత్, బాలస్వామి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అర్బన్‌లో..

సిద్దిపేటఅర్బన్: గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం వల్ల పేదలపై తీవ్ర భారం పడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శశిధర్ ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై కట్టెల పొయ్యి పెట్టి, గ్యాస్ బండకు ఉరి తాళ్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగనప్పటికీ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం ఏమిటని ప్రశ్నించారు. శిరీష, ప్రశాంత్, అభినవ్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై మరింత భారం

గజ్వేల్‌రూరల్: వంట గ్యాస్ ధర పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత భారం మోపిందని సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, పోచయ్య, రమణాకర్, సాయికుమార్, భిక్షపతి, ఎల్లం, కనకయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్న బీజేపీ



పాదయాత్రలో పాల్గొన్న శ్రీనివాస్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): డా.బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా వ్యవహరిస్తున్న బీజేపీకి రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పాలని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర మండల కో–ఆర్డినేటర్ మేడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పాదయాత్రలో భాగంగా మండల పరిధిలోని కడవేర్గు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగాన్ని చేత పట్టి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ సమర్థించడం సిగ్గుచేటన్నారు. బడుగు, బలహీనవర్గాల హక్కుల పరిరక్షణకై రాజ్యాంగం రూపొందించారని, అలాంటి రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, రవి, శ్రీకాంత్, నాని, సంతోష్‌రెడ్డి, బాలచందర్, డేవిడ్, వెంకటస్వామి, మహేశ్, వినీత్, సన్నీ, రాకేశ్, రమేశ్, కళావతి, జయ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరి బాధ్యత

సిద్దిపేటమూస్: రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలోని పలు వార్డులలో మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ అందరి బాగోగుల కోసం రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, సతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకు పాదయాత్ర

తొగుట(దుబ్బాక): అఖిల భారతీయ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ అభియాన్ పాదయాత్ర మంగళవారం మండల పరిధిలోని బూర్గుపల్లి నుంచి లింగాపూర్ మీదుగా వెంకట్రావు పేటకు చేరుకొంది. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమన్వయ కో–ఆర్డినేటర్ అనంతుల శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, స్వామి, అనిల్, కృష్ణ, ప్రవీణ్, నర్సింహులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్, గొల్లపల్లి, బీజీవెంకటాపూర్ గ్రామాల్లో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఐక్యమత్యంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, కరుణాకర్, భాస్కర్‌రెడ్డి, మల్లేశం, మహేశ్ యాదవ్, రమేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడాలి

నంగునూరు(సిద్దిపేట): రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం మగ్దుంపూర్, రాంపూర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, భారత రాజ్యాంగ రక్షణ, దేశ ప్రజారక్షణ పేరిట నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు, కార్యక్రమంలో యాదగిరి, ఎల్లం, శంకర్, సత్తయ్య, నితిన్‌కుమార్, ఇమ్రాన్, అశోక్, రమేశ్, రమేశ్, నర్సింహులు, సత్తిరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యాశకు పోతే అసలుకే మోసం

సీఐ శ్రీనివాస్



దుబ్బాకటౌన్: స్మార్ట్‌ఫోన్‌తో సులభంగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో యువతీ, యువకులు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సీఐ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలతో ప్రజలు సైబర్ మోసాలకు గురవుతున్నారన్నారు. వాటితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యాశ, నిర్లక్ష్యమే సైబర్ నేరాలకు పునాదవుతుందన్నారు. ఐపీఎల్ సీజన్ జరుగుతున్న నేపథ్యంలో యువత ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు పాల్పడవద్దని కోరారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా బెదిరింపులు, భయభ్రాంతులకు గురిచేస్తే తక్షణమే పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని కోరారు.

పరీక్ష నిర్వహణలోనూ వినూత్నం


హాల్ టికెట్లను అందజేస్తున్న ఎంఈఓ

మద్దూరు(హుస్నాబాద్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోను పరీక్షల నిర్వహణలో వినూత్న పంథాను అనుసరిస్తున్నారు. ధూళ్మిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి జరగనున్న వార్షిక పరీక్షలకుగాను ప్రైవేట్ పాఠశాల్లో లాగానే ఎంఈఓ మీనాంజనేయులు విద్యార్థులకు మంగళవారం హాల్‌టికెట్లను అందజేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల 33 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్, బూర్గుపల్లి, బూస్నాపూర్, వెంకటాపూర్, తోర్నాల, దుబ్బాక మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామాలలో బుధవారం ఉదయం 10 నుంచి 11.30 వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

ప్రశాంత్‌నగర్‌లో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ ఎల్ఐసీ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుషాల్‌నగర్, బృందవన్ కాలనీ, మణికంఠ కాలనీ, ఆదర్శనగర్, ఎల్ఐసీ కాలనీ, శ్రీనివాస నగర్, సాజీద్‌పుర, టెలికాంనగర్, మహాశక్తి నగర్, కేసీఆర్ నగర్, విద్యనగర్ ప్రాంతాలలో బుధవారం ఉదయం 7.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులతో ఎంఈఓ ప్రభుదాసు తదితరులు

దుబ్బాక: ఇస్రో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువికా–2025 జాతీయస్థాయి శిక్షణకు ఎంపికైన లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులను మంగళవారం ఎంఈఓ ప్రభుదాసు అభినందించారు. 9వ తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, కౌశిక్, సుశాంత్ శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధన కేంద్రంలో 15 రోజుల పాటు ఉపగ్రహ నిర్మాణం, రాకెట్ లాంచింగ్, అంతరిక్ష పరిజ్ఞానంపై ఇచ్చే శిక్షణలో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ జ్యోతిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, సీఆర్పీ నవీన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజల సహకారం అవసరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: ప్రజలంతా చెత్త విభజనకు సహకరిస్తే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. పట్టణంలోని 1, 3వ వార్డుల్లో చెత్త విభజనపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 40 శాతం ఇంటి యజమానులు చెత్తను వేరుచేసి ఇస్తున్నారని, శతశాతం కావాలంటే ప్రజలంతా సహకరించాలని కోరారు. బహిరంగంగా చెత్తను పారబోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం పర్యావరణ అధికారి రవి కుమార్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వార్షిక వేడుక


విద్యార్థుల నృత్యాలను తిలకిస్తున్న ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): గ్రామం నుంచి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ఉండేలా తల్లిదండ్రులు, యువకులు కృషి చేయాలని ఎంఈఓ పి.శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దమ్మక్కపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన అధ్యాపకులుంటారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేశం, హెచ్ఎం రాంచంద్రారెడ్డి, నోడల్ అధికారి విఠల్, గెజిటెడ్ హెచ్ఎం శ్రీనివాస్, ఏపీసీ కల్పన, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శకటోత్సవం


వేడుకలలో పాల్గొన్న భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారంలో నిర్వహిస్తున్న సీతారాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శకటోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు ఎడ్ల బండ్లు, వాహనాలను ఆలయం చుట్టూ తిప్పి స్వామి వారిని దర్శించుకొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దళారులకు అమ్మి మోసపోవద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ధాన్యాన్ని దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మండలంలోని జగదేవ్‌పూర్, వట్టిపల్లి, మందాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఏఓ వసంతరావు, సీఈఓ రాములు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్ మల్లేశం, మాజీ ప్రజాప్రతినిధులు కవిత, నాగరాజు, భాస్కర్‌రెడ్డి, భిక్షపతి, రజిత పాల్గొన్నారు.

వంగరామయ్యపల్లిలో..

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని విశాల పరపతి సంఘం సీఈఓ తిరుమల కోరారు. వంగరామయ్యపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. సింగిల్ విండో డైరెక్టర్ తిరుపతి, రమేశ్‌నాయక్ రైతులు పాల్గొన్నారు.

◆ అసౌకర్యాలు ఉండొద్దు: ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): ఈ నెల 11 నుంచి జరిగే వార్షిక పరీక్షల్లో ఎలాంటి అసౌకర్యాలు ఉండకుండా చూసుకోవాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూసుకోవాలన్నారు.

◆ చట్టాలపై అవగాహన

వర్గల్(గజ్వేల్): మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్ విధులు, ప్రయోజనాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ నిత్యం అందుబాటులో ఉంటుందని చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు, మహిళలను ఎవరైనా వేధిస్తే డయల్ 100 లేదా షీ టీమ్ వాట్సాప్ నంబరు 87126 67434కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశంగౌడ్, పీసీ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సౌండ్ బాక్స్ బహూకరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1999–20లో చదువుకున్న పూర్వవిద్యార్థులు రూ.7,500 విలువ గల ఒక బీరువా, సౌండ్ బాక్స్‌ను మంగళవారం అందజేశారు. హెచ్ఎం మోహన్ నాయక్ మాట్లాడుతూ ఫీనిక్స్ ఫౌండేషన్ ప్రతినిధి రాజకుమార్‌ను కోరగా వెంటనే రూ.20వేల విలువ గల సౌండ్ బాక్స్‌ను అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు.

◆ సీఎం సహాయనిధి పేదలకు వరం

మర్కూక్(గజ్వేల్): సీఎం సహాయనిధి పేద ప్రజలకు అండగా నిలుస్తుందని మాజీ సర్పంచ్ భాస్కర్ అన్నారు. గ్రామానికి చెందిన చింతకాయల దివ్యకు మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాపురెడ్డి, సతీశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

◆ నూతన కార్యవర్గం ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీఎస్ ఈఈయూ యూనియన్ రీజినల్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సిద్దిపేటలో మంగళవారం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా అధ్యక్షుడిగా బాబూరావు, కార్యదర్శిగా శివప్రసాద్, ట్రెజరర్‌గా భూపతి, కార్యవర్గ సభ్యులుగా జైపాల్‌రెడ్డి, హరిశ్రీనివాస్, యాదగిరి, వజీర బేగం సుధాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, ఐలయ్య, శంకర్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

దౌల్తాబాద్(దుబ్బాక): కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు సంబారపు నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసం చేసిందన్నారు. 27న వరంగల్‌లో నిర్వహించబోతున్న రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ గుండారం గ్రామ నాయకులు కలిసి సన్మానించారు. గ్రామంలోని మత్తెడబండ చెక్ డ్యాంను నిర్మించాలని, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అజయ్ వర్మ, సాన వేణు, యూత్ నాయకులు శ్రీశైలం, రాజు, నరేశ్, సతీశ్‌రెడ్డి, వినిత్ కుమార్ పాల్గొన్నారు.